RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 12 సంచిక : 230 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 23 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల జాబితా సిద్ధం

## - రేవంత్ పైనే భారం, లిస్టులో..!!



## గెలుపు గుర్రాలు ఎంపిక ఆయనదే

హైదరాబాద్ : అనూహ్య విజయాన్ని అందించి.. పదేళ్ల కలను సాకారం చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం అదిరే ఆఫర్ ఇచ్చేసింది. మరికొద్ది రోజుల్లో జరిగే లోక్ సభ ఎన్నికల్లో పార్టీ తరపు పోటీ చేసే గెలుపు గుర్రాల్ని డిసైడ్ చేసే గురుతర బాధ్యతను ఆయనకు అప్పజెప్పటమే కాదు.. అభ్యర్థుల ఎంపికలో ఆయనకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. రోటీన్ కు భిన్నంగా రేవంత్ కు మరింత స్వేచ్ఛను ఇచ్చేందుకు వీలుగా రాహుల్ అండ్ కో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తెలంగాణలోని ఏయే నియోజకవర్గాల్లో ఎవరెవరు గెలిచే అవకాశాలు ఉన్నాయన్న విషయాలపై చర్చలు జరిగాయి. ఈ మేరకు తాను చేసిన కసరత్తును వేణుగోపాల్ కు ముఖ్యమంత్రి రేవంత్ వివరించినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ నుంచి వచ్చిన విషయాల పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లుగా సమాచారం.

అంతేకాదు తాము కానీ గేట్లు ఎత్తుతే.. బీఆర్ఎస్ ఖాళీ అయ్యే అవకాశం ఉందన్న విషయాన్ని పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రజల్లో పట్టు కోల్పోతుందని.. ఆ పార్టీ నుంచి అనేక మంది కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారి విషయంలో తాము ఏం చేయాలో దిశానిర్దేశం చేయాలని రేవంత్ కోరినట్లుగా తెలుస్తోంది. తాము గేట్లు తెరిస్తే.. లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేదని.. అందుకే బీజేపీతో కాళ్ల బేరానికి ప్రయత్నిస్తున్నట్లుగా చెప్పినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ లోక్ సభ ఎన్నికల తర్వాతే నిర్ణయిద్దామని చెప్పినట్లుగా సమాచారం. కొన్ని నామినేటెడ్ పోస్టులపై వేణుగోపాల్ లో రేవంత్.. భట్టిలు చర్చించినట్లుగా చెబుతున్నారు. తాజాగా ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ సర్కారు అవినీతి కళ్లకు కట్టినట్లుగా ప్రజలకు తెలియజేయటంలో సక్సెస్ అయినట్లుగా చెప్పినట్లు తెలిసింది. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండి కూడా కేసీఆర్ సభకు రాకపోవటం కాంగ్రెస్ నైతిక విజయమన్న రీతిలో అధిష్ఠానం వద్ద చెప్పినట్లుగా తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికలకు సంబంధించి రేవంత్.. భట్టి ఏకాభిప్రాయంతో ఉన్న నేపథ్యంలో.. రేవంత్ కు మరింత ఫ్రీ హ్యాండ్ ఇవ్వటంతో పాటు.. అభ్యర్థుల ఎంపికలోనే ఆయనకు స్వేచ్ఛ ఇవ్వనున్న విషయాన్ని తెలియజేసినట్లుగా చెబుతున్నారు.

## ఆదివాసీల ఆశలపై నీళ్లు చల్లిన కేంద్రం.. ఏం చేసిందంటే..?



మేడారం: ఆదివాసీల ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. సమ్మక్క సారమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఆదివాసీలు గత కొంతకాల నుంచి కోరుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి ఇదే అంశంపై విన్నవించారు.

కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించలేమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ తరపున సమ్మక్క సారమ్మకు గురువారం నాడు కిషన్ రెడ్డి మొక్కులు చెల్లించారు. ఆ తర్వాత మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి మాట్లాడారు.

**కిషన్ రెడ్డి ఏమన్నారంటే...** సమ్మక్క సారమ్మ పండుగను జాతీయ పండగగా గుర్తించడం సాధ్యం కాదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తేల్చిచెప్పారు. జాతీయ పండగగా గుర్తించే సిస్టం దేశంలో మరే చోట లేదని స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా ఈ సారి కూడా జాతర కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కిషన్ రెడ్డి వివరించారు. జాతర కోసం రూ. 3.14 కోట్ల నిధులు అందజేశామని వివరించారు. సమ్మక్క సారమ్మ పేరుతో సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. గిరిజన వర్సిటీలో ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రధాని మోదీ చెప్పారని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## ఇసుకేస్తే రాలనంత జనం.. అన్ని దారులు మేడారం వైపే





మేడారం : దేశంలోనే రెండవ అతిపెద్ద జాతర, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమక్క-సారక్క జాతరకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడరం భక్తజనసంద్రంగా మారింది. ఉదయాన్నే జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది. గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గుడారాలతో పరుచుకున్నాయి. నాలుగు రోజుల పాటు మేడారం జాతర జరుగనుంది. నిన్నటి నుంచి జాతర మొదలైంది. ఈనెల 24 వరకు జాతర జరుగనుంది.

మొదటి రోజు పగిడిద్దరాజు, గోవిందరాజులు మేడారం గద్దెపైకి చేరడంతో మేడారం జాతరకు బీజం పడింది. ఆ తరువాత కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చారు. ఆపై సమక్కను ఈరోజు చిలకలగుట్ట నుంచి సమక్కను తీసుకువస్తారు. అమ్మవార్లు గద్దెలపైకి చేరాక భక్తులు తమ తమ మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం చివరి రోజు అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.




# కాంగ్రెస్ దెబ్బకు 'కారు' టైర్లు ఊడుతున్నాయ్!

## రాష్ట్రంలో బీఆర్ఎస్ చేజారుతున్న మునిసిపాలిటీలు ఒక్కొక్కటిగా కైవసం చేసుకొంటున్న కాంగ్రెస్

హైదరాబాద్ : రాష్ట్రంలో అధికార ప్రభుత్వం మారడంతో క్షేత్ర స్థాయి రాజకీయం మారుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలిచిన అభ్యర్థులు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గూటికి చేరడం చూశాం. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే ఈ సీన్ రివర్స్ అయ్యింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకొంటున్నారు. గతంలో కాంగ్రెసను వీడి బీఆర్ఎసలో చేరిన వారు కూడా సొంతగూటికి చేరుతున్నారు. మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు అధికమయ్యాయి. వెరసి.. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ చేతిలో ఉన్న మునిసిపాలిటీ పాలకవర్గాలు ఒక్కొక్కటిగా హస్తగతం అవుతున్నాయి. మరోపక్క, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడం దృష్టి పెట్టిన కాంగ్రెస్ కూడా మునిసిపాలిటీలపై పట్టుకోసం అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో సగానికిపైగా మున్సిపాలిటీలను తమ సొంతం చేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కాంగ్రెసను బలహీన పరిచేందుకు గతంలో బీఆర్ఎస్ ఏ ఎత్తుగడలు వేసిందో అవే ఎత్తులను హస్తం నేతలు ఇప్పుడు అమలు చేస్తున్నారని అంటున్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగడానికి ఇంకా ఏడాది గడువు ఉండడంతో మెజారిటీ పాలక వర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తుందని అంటున్నారు.

**సింహభాగం బీఆర్ఎస్ ఖాతాలోనే!** బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు వల్లనైతేనేమీ, ఎక్స్ అఫీషియో ఓట్లు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఫిరాయింపుల వల్లనైతేనేమీ రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో 90 శాతానికి పైగా ఆ పార్టీకే దక్కాయి.

దీంతో రాష్ట్ర స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకూ బీఆర్ఎస్ హవా నడిచింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. మున్సిపాలిటీల పాలక వర్గాలు అధికార పార్టీ బాట పడుతున్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటిదాకా 34 మున్సిపాలిటీల పాలక వర్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ్యులు అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. ఇందులో 30 మున్సిపాలిటీల్లో పాలకవర్గ సమావేశాలు కూడా జరిగాయి. వీటిలో 15 మున్సిపాలిటీల్లో పాలకవర్గం ఎన్నికలకు నోటిఫికేషన్లూ జారీ అయ్యాయి. తొమ్మిది మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగ్గా ఆరు మున్సిపాలిటీల్లో జరగాల్సి ఉంది.

ఎన్నికలు జరిగిన 9 మున్సిపాలిటీలూ అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం అయ్యాయి. మహబూబ్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, భూపాలపల్లి, నాస్‌పూర్, మంచిర్యాల, నల్లగొండ, వేములవాడ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరగా.. జగిత్యాల, భువనగిరి, ఖానాపూర్, హుజూర్‌నగర్, సుల్తానాబాద్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల పాలకవర్గ ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. ఇవి కాక మరో 20 మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. మరోపక్క, బీఆర్ఎస్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళుతున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఆ గట్టు మీద చానల్స్ ఈ గట్టు మీదకు రాకూడదంతే...!

పాత తెలుగు సినిమాలో రావు గోపాలరావు డైలాగ్ ఒకటి ఉంది. ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలకూడు అని. అలా ఇపుడు ఏపీలో రెండే వర్గాలు, రెండే పార్టీలు, రెండే కుటుంబాలు వాటి మధ్య భీకర రాజకీయ సమరం. అది దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. ఏపీలో మూడవ ఆల్టర్నేషన్ కి చాన్స్ ఉందో లేదో తెలియదు, అలా తెలుసుకునే రిస్క్ ని ఏ ఒక్క పార్టీ చేయడం లేదు. అందువల్ల 2024 ఎన్నికల్లో పోటీ అధికార వైసీపీ అలాగే టీడీపీ కూటమికే అని చెప్పుకోవాలి. ఏపీలో రాజకీయం ఎంత తీవ్ర స్థాయిలో ఉంది అంటే పై నుంచి దిగువ దాకా నిలువునా అంతా విడిపోయారు. ఒకపుడు రాజకీయ పార్టీలను ఆయా నేతలను అభిమానించేవారు ఉండేవారు. వారిలో వారు ఎంత చర్చించుకున్నా వాదించుకున్నా చివరికి మిత్రులుగానే ఉండేవారు. ఇపుడు ఆ పారిస్థితి లేదు. వర్గ శత్రువులుగా మారిపోతున్నారు. అంతే కాదు ఆఫీసులలో పిచ్చాపాటీ కబుర్లలో దొర్లే రాజకీయాలు సైతం పూర్వంలా ఉండడంలేదు. ఒక పార్టీని అభిమానించేవారు రెండవ పార్టీని అభిమానించే వారిని పూర్తి స్థాయిలో ద్వేషిస్తున్నారు. వారితో మాటలు కూడా కట్ చేసుకుంటున్నారు. ఇక వ్యవస్థలలో ఇలాగే కనిపిస్తోంది. కీలక వ్యవస్థలలో రెండు పార్టీల సానుభూతిపరులు ఉంటున్నారు. వారికీ వీరికీ మధ్య పచ్చ గడ్డి వేయకపోయినా భగ్గుమంటోంది. ఇంతటి నిట్టనిలువు చీలిక ఏపీ రాజకీయాల్లో ఇంతకు పూర్వం ఎవరూ చూసి ఉండరు. దాంతో ఏ పార్టీ గురించి ఎవరు ఫేవర్ గా మాట్లాడినా రచ్చ అవుతోంది. రావణ కాష్టం అవుతోంది. ఈ నేపథ్యంలో పాత్రికేయులది కూడా ఒక కష్టతరమైన బాధ్యత. ఫలనా పార్టీకి అనుకూలంగా ఉండే చానల్ కానీ పత్రికలో కానీ పనిచేస్తున్నారు అంటే ఆ పార్టీ వారే అని ఎదుటి పార్టీ నిర్ణయించేసుకుంటోంది. వారు కూడా తమ పత్రిక అనుకూలం అయిన పార్టీ గొంతుకతోనే ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దాంతో ఆయా చానళ్ళు పత్రికలు బ్యాన్ అని ముఖం మీద చెప్పేస్తున్నారు. అయినా పాత్రికేయ వృత్తి అంటూ కొంతమంది తాము పనిచేసే మీడియాకు ప్రత్యర్థి పార్టీ రాజకీయ సభలకు వెళ్తున్నారు. అక్కడ వారు చేసే పని వారికి పురమాయించిన పని కూడా ఉన్నంతలో నెగిటివిటీని పోగు చేసి మీడియాకు సరుకుని తీసుకుని రావడమే. దాంతో వారు చేస్తున్నది ఏంటి అంటే మధ్యాహ్నం మీటింగ్ అయితే ఉదయం కుర్చీలు ఖాళీగా ఉంటే వాటిని ఫోటోలు తీస్తున్నారు. సభలో నుంచి చివరలో వెళ్లేవారు ఉంటే మొదట్లోనే లేచి వెళ్ళిపోతున్నారు అని చిత్రీకరిస్తున్నారు. ఇలాంటి చోట్ల తమ టాలెంట్ ని ఎడిటింగ్ ని కూడా జోడిస్తున్నారు. అదే విధంగా ఆయా పార్టీల అధినాయకులు ఫ్లో లో ఏమైనా తప్పు మాట్లాడినా వెంటనే దాన్ని అందిపుచ్చుకుని మెయిన్ స్ట్రీమ్ మీడియాకు అలాగే సోషల్ మీడియాకు చేరవేస్తూ క్షణాలలో వైరల్ చేసి పారేస్తున్నారు. ఇలా రెండు పార్టీలలోనూ ఆయా పార్టీలను అభిమానించే చానళ్ళు మీడియా హౌజ్ లో పనిచేసే వారు చేస్తున్న పని ఎక్కువగా ఇదే ఉంది అని అంటున్నారు. చిత్రమైన విషయం ఏంటి అంటే ప్రతిపక్ష సమావేశాలకు అధికార పక్షం నుంచి అనుకూలంగా ఉన్న మీడియా హాజరైతే వారిని పిలిచి మరీ మైకుల ద్వారా చెబుతూ ఏమీ అనుకోకండి వెళ్ళిపోండి అంటున్నారు. అలా కాదు కూడదు అని ఉంటే మాత్రం వారి క్యాడర్ బడిత పూజ చేస్తున్నారు. ఇలా మీడియా కూడా ఎపుడో రాజకీయ రంగు పులుముకుంది. ఇపుడు అందులో పనిచేసే వారు కూడా ఆయా పార్టీ సానుభూతిపరులే అన్న భావనకు ప్రత్యర్ధి పార్టీలు వచ్చేస్తున్నాయి. ఇది దురదృష్టకరం. కానీ పీక్స్ లో సాగుతున్న ఏపీలో వర్గ పోరు కానీ రాజకీయ పోరు కానీ చూస్తే ఇవి ఇలాగే ఉంటాయని అనుకోవాలి. ఇదంతా ఎందుకు అంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాప్తాడులో ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలో ఒక టీడీపీ అనుకూల మీడియా ఫోటోగ్రాఫర్ ని కొట్టారని వార్తలు రావడం వల్లనే. ఆ మీడియా అధికార పార్టీకి వ్యతిరేకం అని పై స్థాయి నుంచి అంతా చెబుతూ ఉంటారు. ఇక వైసీపీ అధినాయకత్వమే ఆ పత్రికాధిపతులను సభలలో పేరు పెట్టి మరీ విమర్శలు చేస్తుంది. మా సభలకు రావద్దు అని ఆ పార్టీ నేతలు ఎపుడో చెప్పేశారు. అయినా వెళ్తే ఇలాంటివే జరుగుతాయని మాజీ మంత్రి కొడాలి నాని లాంటి వారు అంటున్నారు. పది లక్షల జనంతో జరిగే భారీ మీటింగ్ లో మీరు దయచేసి రావద్దు అని ఆయన కొన్ని టీడీపీ అనుకూల మీడియా పేర్లు చెప్పి మరీ స్పష్టం చేశారు. ఇక ఆయా పత్రికాధిపతులు నేరుగా అక్కడికి వస్తే వారికి కాలూ కీలూ కూడా తమ క్యాడర్ ఊడగొడతారు అంటూ ఆయన మరింత ఆశ్చర్యపరచేలా వ్యాఖ్యలు చేశారు. ఆయన చేశారు అని కాదు వాతావరణం అలా ఉంది. టీడీపీ వారు కూడా అధికార పత్రిక అంటూ ఒక పేపర్ ని ఎపుడూ చెబుతూ ఉంటారు. వారిని వీరు కూడా బ్యాన్ చేశారు. కానీ అక్కడ వ్యతిరేక వార్తలు వండడానికి వీరికి మీడియా ముడి సరుకు కావాలి. అలాగే వారికీ కావాలి. మధ్యలో బలి అయ్యేది అచ్చంగా పాత్రికేయులే. అందుకే కొడాలి నాని చెప్పారని కాదు కానీ ఆ గట్టు మీద మీడియా ఈ గట్టు మీదకు వాలకపోవడమే ఏపీ రాజకీయాలకు మంచిదే. ఇదేమి ప్రజాస్వామ్యం అని ఎవరూ అడగవద్దు. ఎందుకంటే ప్రజాస్వామ్యం అనుకుంటూ నేతి బీరకాయలో నేతిని చూసే జనాలు ఇపుడు ఎవరూ లేరు కనుక.

# దూరం.. రేషన్ భారం



పెద్దపల్లి: ఓదెల మండలం పిట్లలఎల్లయ్యపల్లి పంచాయతీ పరిధిలో రేషన్ దుకాణం లేకపోవడంతో వినియోగదారులు 3 కి.మీ.ల దూరంలోని గుండ్లపల్లికి వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు ప్రైవేటు వాహనాలు ఆశ్రయిస్తుండటంతో ఆర్థికంగా భారంగా మారింది. పెద్దపల్లి మండలం గోపయ్యపల్లి పంచాయతీలోనూ ఇదే పరిస్థితి. పొరుగున ఉన్న పాలితం గ్రామంలోని రేషన్ దుకాణం నుంచి సరకులు తెచ్చుకోవడానికి 3 కి.మీ.ల దూరం వెళ్లాల్సి వస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రభుత్వం ఉచితంగా రేషన్ సరకులు పంపిణీ చేస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల ఆకలి తీరుస్తోంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. వాటిలో రేషన్ దుకాణాలు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులకు సరకుల కోసం దూర భారం తప్పడం లేదు. కాలినడక కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త చౌకధరల దుకాణాల ఏర్పాటు ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో వినియోగదారులు ప్రతి నెలా సమీపంలోని గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. తమ సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన లేకపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం రేషన్ దుకాణాలను మంజూరు చేస్తే రేషన్ సరకుల వెతలు తీరనున్నాయి.

### ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం

జిల్లాలో మొత్తం 267 పంచాయతీల్లో కొత్తగా ఏర్పడినవి 65. చాలా చోట్ల పూర్వ పంచాయతీలకు 5 కి.మీ.లలోపు దూరంలో ఉన్నాయి. ప్రతి నెలా అక్కడికి వెళ్లి రేషన్ సరకులు తెచ్చుకునేందుకు ప్రజలు తంటాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందించారు. అయిదేళ్లు దాటినా ఆచరణకు నోచలేదు. కొన్ని చోట్ల తక్కువ రేషన్ కార్డులుండటంతో దుకాణాల మంజూరు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా డీలర్లు దుకాణాలు లేని ఊళ్లలోకి సరకులు తీసుకెళ్లి పంపిణీ చేయాలని ప్రాథమికంగా ఆదేశించినప్పటికీ అమలు కావడం లేదు. రవాణా ఖర్చులవుతాయని డీలర్లు తమ దుకాణాల్లోనే సరకులు పంపిణీ చేస్తుండటంతో వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### 413 దుకాణాలు.. 2,19,942 కార్డులు

జిల్లాలోని 14 మండలాల్లో 413 రేషన్ దుకాణాలున్నాయి. మొత్తం 2,19,942 రేషన్ కార్డుల్లో ఆహారభద్రత 2,07,569, అంత్యోదయ 12,217, అన్నపూర్ణ 156 చొప్పున ఉండగా, వాటి పరిధిలో 6,27,187 మంది సభ్యులున్నారు. అంత్యోదయ కార్డుకు నెలకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ప్రతి నెలా పంపిణీకి 32,267 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రేషన్ దుకాణాలు దూరంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల వెతలు వర్ణనాతీతం.

# వేలిముద్రలు వేస్తే డబ్బులు మాయం



పెద్దపల్లి : సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆధునిక సాంకేతికత సాయంతో బ్యాంకు ఖాతాల నుంచి రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత రెండు నెలలుగా భూముల క్రయవిక్రయాలు జరిపిన వారితో పాటు సాక్షులుగా వచ్చి బయోమెట్రిక్ ఆధారాలు ఇచ్చిన వారి బ్యాంకు ఖాతాల నుంచి నగదు గల్లంతైంది.

### కస్టమర్ సర్వీసు సెంటర్ల నుంచే..

ఆధార్ వివరాలు నమోదు చేసి పదేళ్లు పూర్తయిన వారంతా తప్పనిసరిగా మై ఆధార్‌లో వ్యక్తిగత వివరాలు, చిరునామా, చరవాణి, పాన్, బ్యాంకు ఖాతాకు అనుసంధానించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో ఆయా వివరాలు అప్‌డేట్ చేసుకోవడానికి ప్రజలు కస్టమర్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)ల వద్ద బారులు తీరుతున్నారు. కేంద్రాల నిర్వాహకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వేలిమద్రలు, ఫోన్ నంబరు, ఇతర వివరాలు హ్యాకర్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఫలితంగా ఖాతాదారు ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయమవుతున్నాయి. మై ఆధార్‌లో వివరాలు నమోదు చేశాక ఆధార్, బ్యాంకు తదితర వివరాలను కనిపించకుండా సెట్టింగ్ చేసుకోవడం ద్వారా మోసాలను అరికట్టవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

### సైబర్ నేరాలపై లోతైన పరిశీలన

ప్రభుత్వం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 'సైబర్ వారియర్' పేరిట నిపుణుడైన పోలీస్ అధికారిని అందుబాటులో ఉంచుతోంది. వీరు సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులను లోతుగా పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం అందేలా పర్యవేక్షిస్తున్నారు.

సైబర్ మోసాల బారిన పడిన వారు వెంటనే 1930కి ఫోన్ చేసి వివరాలు అందించాలి. బాధితులు 24 గంటల్లోగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌బీ.జీవోవీ.ఐఎన్)లో ఫిర్యాదు చేయాలి. దీంతో బాధితుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు. కోల్పోయిన డబ్బును రికవరీ చేసి తిరిగి అందిస్తున్నారు. సైబర్ మోసం జరిగిన ప్రాంత పోలీస్‌స్టేషన్‌కు వివరాలు పంపిస్తారు. కేసుల విచారణలో జాప్యం జరగకుండా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ విభాగం అధికారులు వీరికి నిరంతరం ఆదేశాలు జారీ చేస్తున్నారు. 'ప్రతిబింబ్' సాఫ్ట్‌వేర్ సాయంతో నేరస్థులను పట్టుకుంటున్నారు.

### ఒడిశా కేంద్రంగా హ్యాకర్ల ఆగడాలు

బ్యాంకు నుంచి నగదు ఉపసంహరించుకున్నపుడు గతంలో చరవాణికి సందేశాలు వచ్చేవి. ఇటీవలి కాలంలో సక్రమంగా రావడం లేదు. దీంతో బాధితులు బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుంటే తప్ప మోసపోయినట్లు తెలియడం లేదు. చాలా మంది మోసపోయినా పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఊరుకుండిపోతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం హ్యాకర్లు ఒడిశా రాష్ట్రం కేంద్రంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో పోలీసులు ఆధునిక సాంకేతికత సాయంతో చాకచక్యంగా కొన్ని కేసులు నమోదు చేసి జైలుకు పంపడంతో పాటు బాధితులకు డబ్బును తిరిగి అందిస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొట్లవనపర్తికి చెందిన దారవేని పోచాలు బ్యాంకు ఖాతా నుంచి సైబర్ మోసగాళ్లు నెల రోజుల వ్యవధిలో రూ.10,000, రూ.9,500, రూ.10,000 చొప్పున ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా విత్‌డ్రా చేసుకున్నారు. పోచాలు వేలిముద్రలు తస్కరించి ఈ మోసానికి పాల్పడగా బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

పెద్దపల్లి జిల్లాకేంద్రానికి చెందిన కుమార్‌తో పాటు అతడి మిత్రులు గతేడాది డిసెంబరు నెలాఖరులో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూ విక్రయ లావాదేవీలకు సంబంధించి వేలిముద్రలు వేశారు. అనంతరం కొద్ది రోజుల్లో వీరి బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం కావడం ఆరంభమైంది. ఒక్కొక్కరి ఖాతా నుంచి రూ.10 వేల వరకు పోవడంతో సంబంధిత అధికారులను కలిసి ఖాతాలను లాక్ చేయించారు. ఇందులో ఇద్దరికి సంబంధించి మాత్రమే రూ.10 వేల చొప్పున తిరిగి ఖాతాల్లో జమయ్యాయి. మిగిలిన వారి డబ్బులు ఎప్పుడు తిరిగిస్తాయో పోలీసులు కూడా చెప్పడం లేదు.

### ఆధార్ నంబర్ల మాస్కింగ్‌తో ప్రయోజనం

సైబర్ నేరాలకు సంబంధించి ఇటీవలి కాలంలో పెద్దపల్లి ఏసీపీ కార్యాలయం పరిధిలో మొత్తం 10 కేసులు నమోదు కాగా 7 పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.10 వేల చొప్పున తిరిగి ఖాతాల్లో నగదు జమైందని ఏసీపీ ఎడ్ల మహేశ్ తెలిపారు. 'మై ఆధార్' యాప్‌లో 12 అంకెల నంబరులో చివరి 4 అంకెలు మాత్రమే కనిపించేలా సెట్టింగ్ చేస్తే ఇలాంటి మోసాలను అరికట్టవచ్చన్నారు. సైబర్ మోసాలు పెరుగుతుండటంతో తమ వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్లకు మాస్కింగ్ చేసిన తర్వాతే అప్‌లోడ్ చేస్తున్నామని సబ్‌రిజిస్ట్రార్ కిరణ్ తెలిపారు. కాగా గోదావరిఖని ఒకటో పట్టణ ఠాణాలోనూ 6 కేసులు నమోదు కాగా ఒక్కరికి కూడా డబ్బులు తిరిగి రాలేదు.

# గృహజ్యోతి అర్హుల ఎంపికలో పురోగతి

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటి 'గృహజ్యోతి'. ఈ పథకం అర్హుల ఎంపిక ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సాగుతోంది. గృహావసరాలకు విద్యుత్తును వినియోగిస్తున్న వారి వివరాలను అధికారులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లాల విద్యుత్తు శాఖ ఎస్‌ఈలతో పాటు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించారు. క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేస్తుండగా, వారికి తోడుగా అధికారులు వెళ్లి గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతినెలా 15వ తేదీ నాటికి విద్యుత్తు బిల్లుల మంజూరు పూర్తవుతుంది. ఈ లోగానే అర్హుల నమోదును కూడా పూర్తిచేయాలన్నది ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశం.

రేషన్‌కార్డు లేకపోయినా..'గృహజ్యోతి' అర్హుల్లో ఎవరికైనా రేషన్‌కార్డు లేకపోయినా వారి వివరాలనూ నమోదు చేసుకుంటున్నట్లు ఉభయ జిల్లాల విద్యుత్తు శాఖాధికారులు చెబుతున్నారు. సర్వీసు నంబరు, ఆధార్‌కార్డు, 'ప్రజాపాలన' దరఖాస్తు రసీదు వివరాలను సేకరిస్తున్నారు. ఎవరైనా ప్రజాపాలన గ్రామసభల్లో అయిదు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోకపోయినా, వారి ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు వంటి వివరాలు సేకరిస్తున్నారు.

### అన్ని కనెక్షన్ల వివరాల సేకరణ

200 యూనిట్ల లోపు వినియోగించే వారికి ఉచిత విద్యుత్తు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చింది. వారితో పాటు గృహాల్లోని అన్ని కనెక్షన్ల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉభయ జిల్లాల్లో మొత్తం 6,36,320 కనెక్షన్లు పథకం పరిధిలోకి వస్తాయన్నది వారి అంచనా. వీరిలో బుధవారం నాటికి సుమారు 75 శాతం మందికి సంబంధించిన వివరాలను సేకరించి ఉండొచ్చని తెలుపుతున్నారు. మిగతా వారివి రెండు, మూడు రోజుల్లో పూర్తిచేయాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు.

### అద్దె ఇళ్లల్లో ఉంటున్నా.. పత్రాలు అందజేయవచ్చు..

అర్హులందరికీ ఉచిత విద్యుత్తు అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో అద్దె ఇళ్లల్లో నివసించే వారికి పథకం వర్తిస్తుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది. ఈ విషయంపై విద్యుత్తు శాఖ అధికారులు ఓ స్పష్టత ఇస్తున్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటూ 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే వారి వివరాలు, సర్వీసు నంబరును నమోదు చేయిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే సిబ్బందికి రేషన్, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు వివరాలు చెబితే చాలన్నారు. లేదంటే సమీప విద్యుత్తు కార్యాలయాలకు వెళ్లి అధికారులకు వివరాలను అందించాలన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అర్హులందరి వివరాలూ సేకరిస్తామన్నారు.

# అందని అధనం

సంగారెడ్డి : 'గ్రామాలలో పాల ఉత్పత్తి పెరగాలి. పాడిని నమ్ముకున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కాలి. మార్కెట్ సదుపాయం కల్పించడమూ ముఖ్యమే. నగర వాసులకు నాణ్యమైన పాలు, పాల పదార్థాలు అందుబాటు ధరలో ఉండాలి'. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం విజయ డెయిరీని ఏర్పాటు చేసింది. ఈ డెయిరీకి పాలు పోసే రైతులకు పలు ప్రయోజనాలు చేకూరుస్తోంది. ఇందులో భాగంగా రాయితీపై దాణా పంపిణీ చేస్తున్నారు. లీటరుకు రూ.4 చొప్పున ప్రోత్సాహకం అందజేస్తామని ప్రకటించారు. ఈ ప్రోత్సాహక నిధులు మూడేళ్లుగా విడుదలకు నోచుకోకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

### ప్రయివేటుకు వెళ్లకుండా

తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య జిల్లా కార్యాలయం పరిధిలో నారాయణఖేడ్, జహీరాబాద్, పుల్కల్‌లో పాలశీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో పాల సేకరణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు డెయిరీలతో పోల్చితే తక్కువ మొత్తం పాలు వస్తుండటం, రైతులు ప్రైవేటు బాట పడుతుండటాన్ని గమనించిన గత ప్రభుత్వం లీటరుకు రూ.4 ప్రోత్సాహకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా సకాలంలో రైతులకు అందకపోవటంతోపాటు అక్కడక్కడా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. మూడేళ్లుగా రైతుల ఖాతాల్లో ప్రోత్సాహక నిధులు జమకాలేదు.

### రూ.5 కోట్లకు పైగా బకాయిలు

ప్రస్తుతం జిల్లాలో నిత్యం 11 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. వెన్నశాతం ఆధారంగా లీటరు పాలకు రూ.36.50 నుంచి రూ.72 వరకు చెల్లిస్తున్నారు. ప్రోత్సాహక నిధులు కూడా తోడవుతుండటంతో విజయ డెయిరీకి పాలు పోసేందుకు ముందుకు వస్తున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రోత్సాహకానికి సంబంధించి ఇప్పటి వరకు రూ.5 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. బిల్లుల జాప్యం కారణంగా ఉత్పత్తిదారులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. పాలు పోసినప్పటికీ ప్రోత్సాహక నగదు అందకపోవటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. నగదు బదిలీ విధానం ప్రవేశపెట్టినా నెలనెలా నగదు అందకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. పాల బిల్లుతోపాటే ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

జిల్లాలో పాల ఉత్పత్తిదారులసంఘాలు: 158
విజయ డెయిరీ పరిధి రైతులు: 4,892
నిత్యం పాల సేకరణ: 11,201 లీటర్లు

# కొత్త ప్రయోగం.. నిరుపయోగం

ఆదిలాబాద్ : కొత్త పద్ధతి అని ఊదరగొట్టారు. భూగర్భ పైప్‌లైన్ వేయించారు. ఇందుకోసం రాష్ట్రంలో తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని మత్తడివాగును ఎంచుకున్నారు. ఇలా మైక్రోఇరిగేషన్ పద్ధతిలో పైపులైన్లు వేసి ఎనిమిదేళ్లు దాటింది. ఇప్పటికీ ఒక్క ఎకరం తడవలేదు. పైప్‌లైన్ల మధ్య నీటి సరఫరా సక్రమంగా జరగక నీరందివ్వడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సాగునీటికోసం సాధారణంగా భూసేకరణ చేసి కాలువలు నిర్మిస్తారు. దీని వల్ల ఇటు రైతుల భూములు తీసుకోవడంతో పాటు అటు నష్టపరిహారం సమస్య ఏర్పడుతోంది. వీటిని అధిగమించేందుకు కొత్తరకం పద్ధతిని ఎంచుకున్నారు. మత్తడివాగు కుడికాలువ నుంచి దాదాపు 1,243 ఎకరాలకు సాగు నీరందించేందుకు ప్రణాళిక రూపొందించారు. పంట చేలలో తవ్వి భూగర్భంలో పైప్‌లైన్లు వేయించారు. వీటివల్ల పంటల సాగుకు ఇబ్బంది రాకుండా చూశారు. 9కిలోమీటర్ల పొడవునా 450 దయా వ్యాసం ఉండే పైప్‌లైన్ వేయగా మధ్యలో



చిన్నపైప్‌లైన్(డిస్ట్రిబ్యూటరీ లైన్ల)ను అనుసంధానించారు. ఎత్తిపోతల పథకం మాదిరిగా మత్తడివాగు వాగు నుంచి నీటిని తీసుకునేందుకు అక్కడే మోటార్లను ఏర్పాటు చేశారు. సంప్‌హౌజ్‌లు నిర్మించారు. ఇవన్నీ నిరుపయోగంగానే ఉన్నాయి.

### చుక్క నీరు రాలేదు..

రూ.5.75 కోట్ల వ్యయంతో జైన్ ఇరిగేషన్ కంపెనీ లిమిటెడ్ ఈ పనులు చేపట్టింది. 2015లో పనులు మొదలుకాగా ఏడాదిన్నర కిందటి వరకు సాగాయి. డిస్ట్రిబ్యూటరీ లైన్ల కోసం 200 చోట్ల అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు. ప్రతి అవుట్‌లెట్ నుంచి ఆరు ఎకరాల వరకు సాగు నీరందించవచ్చు. ఈ అవుట్‌లెట్ పైప్‌లైన్‌కు ఆనుకొని ఉన్న బాక్సుల్లో ఆటోమెటిక్ వాల్వు ఏర్పాటు చేయించారు. ఇందులో ఉండే సెన్సర్ నీరు రాగానే వాల్వు తెరుచుకుంటుంది. నీటి సరఫరా ఆగిపోగానే మూసివేస్తుంది. సౌర విద్యుత్తు ఆధారంగా ఇది పని చేసేలా ఏర్పాటు చేశారు. ఇదంతా చెప్పడానికి గొప్పగా ఉన్నా ఒక్క ఎకరం తడవకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### బయటపడ్డ లోపాలు

మత్తడివాగు వద్ద నిర్మించిన సంప్‌హౌజ్‌లో 75 హెచ్‌పీ సామర్థ్యంతో నాలుగు వేర్వేరు మోటార్లను ఏర్పాటు చేశారు. మూడున్నరేళ్ల కిందట కొనుగోలు చేసిన ఈ మోటార్లకు నీళ్లు అందివ్వకముందే మరమ్మతులు చేయించాల్సి వచ్చింది. ఇప్పటికి రెండుమార్లు ట్రయల్‌రన్ చేశారు. పైప్‌లైన్లలోంచి సక్రమంగా నీరు వెళ్లడం లేదని పలు చోట్ల తవ్వాల్సి వచ్చిందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఈ లోపాలతో సాగునీరు ఇవ్వక జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎదురుచూస్తూనే ఉన్నాం

అందె అశోక్, రైతు, పొన్నారి, తాంసి

నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. యాసంగిలో నీరందిస్తే రెండో పంటకు వీలుంటుంది. ఎనిమిదేళ్లుగా రైతులంతా ఎదురుచూస్తూనే ఉన్నాం. నీరు మాత్రం ఇవ్వడం లేదు.

### మోటార్లకు మరమ్మతులు చేయించాం శ్రీనివాస్‌రావు, డీఈ

పైప్‌లైన్లు వేసేందుకు భూముల్లో పంటలు ఉండటంతో ఆలస్యమైంది. ఏడాది కిందటనే ట్రయల్ రన్ చేశాం. మోటార్లు తుప్పు పట్టడంతో మరమ్మతులు చేయించాం. గ్రామాల వారీగా సాగునీరు అందించేలా ప్రణాళిక చేశాం.

# వక్ఫ్ బోర్డు చైర్మన్‌ని కలసిన ముస్లిం నాయకులు



**గంభీరావుపేట ఫిబ్రవరి 22(ప్రభాత సమాచారం):**
తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్గా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన అజ్మతుల్లా హుస్సేని నియమితులైన విషయం తెలిసిందే. గురువారం గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ యాసిన్ హుస్సేన్ నేతృత్వంలో హైదరాబాద్ హజ్ హౌస్ చేరుకుని తెలంగాణ వక్ఫ్ బోర్డు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాసిర్ హుస్సేన్, సయ్యద్ హాష్మీ,మక్సూద్, నిజమోద్దీన్ ఉన్నారు.

# నేరాల అదుపులో విద్యార్థులు కీలక పాత్ర వహించాలి సిఐ దేవయ్య




**బెల్లంపల్లి,ఫిబ్రవరి 22( ప్రభాత సమాచారం)**
మహిళల పై జరిగే నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని సీఐ దేవయ్య అన్నారు.. బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ ఆధ్యర్యంలో బెల్లంపల్లి బస్తి లో ని ప్రభుత్వ ఎస్ సి గర్ల్స్ హాస్టల్ లో షి టిం మరియు సైబర్ క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించి విద్యర్తులకు అవగాహన కలిగించడం జరగిందివిద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు ఎవరి నుండైన ఇబ్బందులకు గురైనప్పుడు, ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి పిర్యాదు చేయాలన్నారు, పిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చట్టరీత్యా చర్య తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు.సూచించారు

# ఔదార్యం చాటుకొన్న స్నేహితులు



**తాండూర్, ఫిబ్రవరి22(ప్రభాత సమాచారం)**
తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన పంబాల రమేష్ అనే ఫోటోగ్రాఫర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి స్నేహితులు పదవ తరగతి 1994 – 95 జెడ్ పి ఎస్ ఎస్ తాండూర్ పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై పంబాల రమేష్ కుమారుడు విష్ణు తేజ, కూతురు వర్షిని లకు 38 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ కుటుంబానికి తాము ఎప్పటికి అత్యవసర సహాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ములుకుట్ల బక్కయ్య, సింగారావు రఘు, కేశెట్టి విజయ్, కటకం తిరుపతి, అన్నం శ్రీనివాస్,ఎం తిరుపతి,ఎల్కా రాజేష్ లు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదవాలి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి ఫిబ్రవరి 22(ప్రభాత సమాచారం)**
విద్యార్థులు కష్టపడి చదివి,అన్ని రంగాల్లో రాణించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని ఆదిశగా పయనించాలన్నారు. సంకల్పం గొప్పదైతే సాధించలేనిది అంటూ ఏమీ లేదని పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల పక్షాన ఎల్లవేళలా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సిఓ గంగాధర్, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచ్చేందుకు ప్రత్యేక పథకాలు

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్













**సిరికొండ ఫిబ్రవరి 22(ప్రభాత సమాచారం)**
ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచ్చేందుకు ప్రత్యేక పథకాలు చేపడుతామని,గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం సిరికొండ మండలంలోని బ్రిడ్జిని పరిశీలించి,కన్నాపూర్, పోచంపల్లి, లచ్చింపూర్ (కె), వాయిపేట, ఫకీర్ నాయక్ తండా, భీంపూర్,ధర్మసాగర్, రాంనగర్,తదితర గ్రామాల్లో పర్యటించి సిసి రోడ్స్ తో పాటు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు.ముందుగా గ్రామస్తులు డోలు వాయిద్యాల మధ్య ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి,శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. త్రీఫేజ్ కరెంట్,నీటి, రోడ్డు సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ధర్మసాగర్ నుండి వాయిపేట వరకు రోడ్డు వేస్తామన్నారు. త్వరలో ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి ఆ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం,వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

## - ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు



**గుడిహత్నూర్ ఫిబ్రవరి 22( ప్రభాత సమాచారం**
పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలంటే స్వయం ప్రణాళిక పాఠ్యాంశ పునశ్చరణతో పాటు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించడం తేలికని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల గదికి వెళ్లి పదో తరగతి విద్యార్థులకు బోధనపై ఆరా విద్యార్థులతో పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలను అడగగా వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు గణిత శాస్త్రం బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో 10వ తరగతి తొలిమెట్టు లాంటిదని, విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ గ్రేట్ పొందేలా బోధించాలని కలెక్టర్ కోరారు. విద్యార్థులు రాతపరమైన అంశాలను జాగ్రత్తగా ప్రజెంట్ చేసే విధంగా తగినంత సమయం నుంచి జవాబు రాసే విధానాన్ని పాటించాలన్నారు. రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భయం, ఆందోళన లేకుండా ధైర్యంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఎంఈఓ అర్. నారాయణ, తహశీల్దార్ కవిత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అర్. దేవిదస్, పాల్గొన్నారు

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

## అదనపు కలెక్టర్ పూజారి గౌతమి
## హైదరాబాద్ సీడీఎంఏ నుంచి డైరెక్టర్ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్

**గంభీరావుపేట (సిరిసిల్ల) ఫిబ్రవరి 22 (ప్రభాత సమాచారం)**
తాగు నీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించామని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తెలిపారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. జిల్లాలోని ఆయా బల్దియాల పరిధిలో ప్రస్తుతం ఎక్కడా తాగునీరు సమస్య లేదని ఆమె స్పష్టం చేశారు. అంతకుముందు రానున్న వేసవిలో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ సీడీఎంఏ నుంచి డైరెక్టర్ దివ్య దేవరాజన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు), మున్సిపల్ కమీషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు.మున్సిపాలిటీ ల పరిధిలో ఎక్కడా తాగునీరు సరఫరా లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంక్ ల నుంచి ప్రతీ ఇంటికి నీరు సరఫరా లో ఏమైనా లోపాలు ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బల్దియాల పరిధిలో చివరి గృహాలు, పైప్ లైన్ లేని, గుడారాలు వేసుకొని ఉండేవారికి కూడా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బస్ స్టాండ్, మార్కెట్, ఇతర రద్దీ ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వడదెబ్బ నియంత్రణ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్దంగా పెట్టుకోవాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు నిత్యం చేయించాలని, ప్రతీ ఇంటి నుంచి చెత్తను ట్రాక్టర్లలో సేకరించాలని వివరించారు.



**మొక్కల సంరక్షణ..**
మున్సిపాలిటీల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని డైరెక్టర్ దివ్య దేవరాజన్ ఆదేశించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీళ్ళు పోసి కాపాడాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్, ఆయిల్ ఇండస్ట్రీలు ఉంటే జాగ్రత్తలు తీసుకునేలా అగ్ని మాపక శాఖ అధికారులతో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించాలని తెలిపారు. పబ్లిక్ పార్క్ లలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని వివరించారు. పక్షుల కోసం నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమీషనర్లు లావణ్య, అన్వేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన



**తలమడుగు ఫిబ్రవరి 22 (ప్రభాత సమాచారం)**
తలమడుగు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయి కృష్ణ, రమణ గౌడ్ గొడిసెల లు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పదోతరగతి పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అపోహలు – సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండడానికి పాటించాల్సిన నియమాలను వివరించారు. పరీక్షలకు ముందున్న సమయాన్ని విద్యార్థులు ఏవిధంగా వినియోగించుకోవాలి, ఎలా చదివితే ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు, చదివే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్ష హల్ లో పాటించాల్సిన నియమాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్ రావ్, గంగన్న ,ఉపాధ్యాయులు రాజేందర్,లలిత, వినోద్ రెడ్డి ,వెంకటేశ్వర్, మురళీధర్,రాకేష్,రవీంద్ర కుమార్,స్వప్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతరలో తీవ్ర విషాదం.. ఇద్దరు మృతి



**మేడారం ఫిబ్రవరి 22(ప్రభాత సమాచారం)**
మేడారం మహా జాతరలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరుకు చెందిన చింతల కొమురయ్య(68) గురువారం జాతరకు వచ్చారు. ఈ సందర్భంగా వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు.మరోవైపు జంపన్న వాగులో స్నానం చేస్తూ మరొక వ్యక్తి గల్లంతు అయ్యారు. కామారెడ్డి జిల్లాకు చెందిన సాయిలు అనే వ్యక్తి వాగులో స్నానం చేస్తూ గల్లంతై మరణించినట్లు సమాచారం. అయితే, ఒకే రోజు ఇద్దరు జాతరలో మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు, పోలీసులు భక్తులను హెచ్చరించారు. వాగులో స్నానం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

## ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కుష్బు గుప్తా







**వాంకిడి ఫిబ్రవరి 22(ప్రభాత సమాచారం)**
ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ పిఓ కుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు.గురువారం వాంకిడి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, పి అచ్ సి వైద్యాశాల బంబారా, క్రీడా ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాలలను పిఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల కంటే ముందే తెలంగాణలో కొలువుల జాతర



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల కంటే ముందే తెలంగాణలో కొలువుల జాతర ప్రారంభం కానుంది. కొత్త నోటిఫికేషన్‌లకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం యత్నిస్తోంది. వారం రోజుల్లో 11 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. మరోవైపు సింగరేణిలోని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. 474 పోస్టుల భర్తీకి సింగరేణి అధికారులు కసరత్తు మమ్మరం చేశారు. నిన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సింగరేణి అధికారులు సమావేశం అయ్యారు. ఇప్పటికే 563 పోస్టులకు గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే అన్ని నోటిఫికేషన్‌లు విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మేడారం జాతర శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చారిత్రక ప్రతీకలుగా, ఇలవేల్పులుగా సబ్బండ వర్గాలచేత పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా తెలంగాణ తొలిముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండేండ్లకోసారి జరిగే మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద అడవిబిడ్డల జాతరగా తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిందని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కొనసాగిన ఆత్మగౌరవ పోరాటంలో సమ్మక్క, సారలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. ఒకనాడు కల్లోలిత ప్రాంతంగా నాటి సమైక్య పాలకుల ఏలుబడిలో అలజడులకు గురైన గోదావరీ లోయ పరీవాహక ప్రాంతం నేడు సాగునీటి జీవజలంతో సస్యశ్యామలమై ప్రజల జీవితాల్లో సాంత్వన నింపిందని అన్నారు. రాష్ట్రం నలుమూలలనుంచి దేశవ్యాప్తంగా తల్లుల దర్శనార్థం కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా చూడాలని వనదేవతలను కేసీఆర్ ప్రార్థించారు.

# కేసీఆర్‌కు నష్టం జరగొద్దనే బండి సంజయ్ తొలగింపు: జగ్గారెడ్డి




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారాస అధినేత కేసీఆర్‌కు నష్టం రాకూడదనే భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను తొలగించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భాజపాకు నిద్రపట్టడం లేదని ఎద్దేవా చేశారు.

ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని.. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారని ప్రశ్నించారు.

# మూడో సారి మోదీ ప్రధాని అవడం ఖాయం



ఆదిలాబాద్: మూడోసారి కూడా నరేంద్రమోదీ ప్రధాని అవడం ఖాయమని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ... మోదీ పాలనలోనే దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉందని చెప్పారు.

ప్రపంచ దేశాలన్నీ ఇండియా వైపు చూస్తున్నాయన్నారు. ఒకప్పుడు ఇండియాను అవమానించిన అగ్ర రాజ్యాలు ఇప్పుడు మన మెప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిని మోదీ సమర్థ వంతంగా ఎదుర్కొన్నారని.. అగ్ర రాజ్యాలన్నీ ఈ విషయంలో చేతులెత్తేసిన సమయంలో ప్రపంచానికి మోదీ అండగా నిలిచారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# సన్‌ఫ్లవర్ రైతులు తొందరపడి అమ్ముకోవద్దు: మంత్రి తుమ్మల



హైదరాబాద్: తెలంగాణలోని సన్‌ఫ్లవర్ రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచన చేశారు. రైతులు తొందరపడొద్దని, క్వింటా రూ.6,760 కంటే తక్కువ ధరకు విక్రయించొద్దని సూచించారు. కనీస మద్దతు ధర కల్పించాలని మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. మరోవైపు మంత్రి తుమ్మలకి మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. సన్‌ఫ్లవర్ రైతులు మద్దతు ధర లేక నష్టపోతున్నారని చెప్పారు. "ఈ ఏడాది సన్‌ఫ్లవర్ మద్దతు ధర క్వింటాకు రూ.6,760. కానీ, రైతులు రూ.5 వేలలోపే అమ్ముకుంటున్నారు. దీంతో రూ.2వేల వరకు నష్టపోతున్నారు. మా ప్రభుత్వంలో మద్దతు ధరలు ఇచ్చి రైతులను ఆదుకున్నాం"అని లేఖలో పేర్కొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




విశ్వ నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్‌కు రహదారుల్లో మణిహారంగా నిలవబోతోంది ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్). హైదరాబాద్ సరిహద్దు జిల్లాలను అనుసంధానిస్తూ ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఈ రహదారి పరిధిలోకి వచ్చే 182 కి.మీ దక్షిణ మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది.

# రైతు సంక్షేమమే లక్ష్యం: ప్రధాని మోదీ



దేశంలోని రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. చెరకు కొనుగోలు ధరల పెంపుదలకు కేంద్ర మంత్రివర్గం నుంచి ఆమోదం లభించిన నేపథ్యంలో మోదీ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

ఈ పెంపుదలతో కోట్లాది మంది చెరకు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. చక్కెర సీజన్ 2024-25 (అక్టోబర్-సెప్టెంబర్) కోసం చక్కెర మిల్లులు చెల్లించాల్సిన చెరకు 'న్యాయమైన, లాభదాయక ధర' (ఈఆర్‌పీ)కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో చెరకు ఎఫ్ఆర్‌పి క్వింటాల్‌కు రూ. 340 ప్రాథమిక రికవరీ రేటు 10.25 శాతంగా నిర్ణయించారు.

10.25% కంటే ఎక్కువ రికవరీలో ప్రతి 0.1% పెరుగుదలకు, క్వింటాల్‌కు రూ. 3.32 ప్రీమియం అందించనున్నారు. ఇదేకాకుండా 9.5 శాతం లేదా అంతకంటే తక్కువ రికవరీ కలిగిన చక్కెర మిల్లులకు ఎఫ్ఆర్‌పి క్వింటాల్‌కు రూ.315.10గా నిర్ణయించారు. కొత్త రేట్లు 2024, అక్టోబర్ 1 నుండి వర్తించనున్నాయి.

# రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీష్‌రావు సీరియస్



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్టు పాలన నడుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తీర్చకుంటే ఉద్యమం చేస్తామని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఇక, తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, హరీష్‌రావు ట్విట్టర్ వేదికగా..'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రచారం చేసుకున్నారు. కానీ, ఆచరణ మాత్రం సాధ్యం కావడం లేదు. 22 రోజులు గడుస్తున్నా అంగన్ వాడీలకు జీతం రాక అనేక తిప్పలు పడుతున్నారు. నెలంతా పని చేసి జీతం కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి వచ్చింది. ప్రభుత్వం తక్షణం స్పందించి, అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, సమగ్ర శిక్ష, కేజీబీవీ సిబ్బంది జీతాలు చెల్లించాలి' అని డిమాండ్ చేశారు.

# గద్దెపైకి సమక్క.. మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం



మేడారం : మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. భక్తులు వేయికళ్లతో ఎదురుచూస్తున్న తరుణం ఆసన్నమైంది. మేడారంలో సమ్మక్క ఆగమన పూజలు ప్రారంభమయ్యాయి. చిలుకలగుట్ట నుంచి సమక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు. కుంకుమభరణి రూపంలో ఉన్న సమ్మక్కను కోయ పూజారులు గద్దెపై ప్రతిష్టించారు. కాగా.. ఇప్పటికే సారమ్మను ఆదివాసీ పూజారులు కొమ్ము బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో తీసుకువచ్చి మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెలపై కొలువుదీరారు. చివరగా సమక్క రాకతో జాతరలో కీలక ఘట్టం పూర్తైంది. సమక్క గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

**భక్తజనసంద్రంగా...** రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడారం భక్తజనసంద్రంగా మారింది.

జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది.

గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో పరుచుకున్నాయి.

# తెలుగు విద్యార్థిని జాహ్నవి కేసులో న్యాయం జరిగేలా చూడాలి: కేటీఆర్



హైదరాబాద్: అమెరికాలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతి కేసుపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఆమె మృతికి కారణమైన పోలీసుపై సాక్ష్యాధారాలు లేకపోవడంతో నేరాభియోగాలు మోపడం లేదని అక్కడి అధికారులు చెప్పడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరు ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ అంశంపై అమెరికా రాయబార కార్యాలయం వెంటనే జోక్యం చేసుకొని అక్కడి ప్రభుత్వ వర్గాలతో మాట్లాడి జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అమెరికా ప్రభుత్వంతో మాట్లాడి.. ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిగేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఉన్నత లక్ష్యాలతో అగ్రరాజ్యం వెళ్లిన జాహ్నవి ప్రమాదంలో చనిపోవడం అత్యంత విషాదకరమైతే, ఆమెకి జరగాల్సిన న్యాయం జరగకుండా కేసు తేలిపోవడం అంతకన్నా బాధాకరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన 23 ఏళ్ల కందుల జాహ్నవి 2023 జనవరిలో సియాటెల్‌లోని పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొని మృతిచెందిన విషయం తెలిసిందే.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660